# విశ్వాంతరంగం

## శైలకుమార్

నిండు గర్భిణి కడుపులావున్నాడు చంద్రుడు

ఆలోచనలు లేని మనసులా వుంది వెన్నెల. సాగగొట్టిన తీగెలాంటి సరుగుడుచెట్లు. అర్థం కానిస్త్రీ హృదయంలా సముద్రం.ఆవేశం తప్ప మరేమీ లేని అలలు.

అలల ఘోషను మరపించే మనసుతో ఇసుకలో వెల్లకిలా పడుకొని ఆలోచిస్తున్నాడు విశ్వం.

**మాసిన** పైజామా, కోరికల్లాగా పెరిగిన గడ్డం, ఎదురు చూపులతో లోతుకు పోయిన కళ్ళు, అస్థిపంజరాన్ని వెక్కిరించే శరీరం, ఇదీ అతని ఆకారపు అస్తిత్వం.

ఇందాక సగంతాగి దాచుకున్న సిగరెట్టును తీసి వెలిగించు కున్నాడు. పొగ వదులుతూ ఆలోచిస్తున్నాడు. అంత కంటే ఏమీ చెయ్యలేడు గనుక.

ఏమిటీ జీవితం? ఏమిటీ మనుషులు? మనుషులందర్నీ ఓ గదిలోకి తోసి డైనమైట్ పెట్టాలి. క్షణం క్షణం రాజీపడటానికి అలవాటు పడి, రాజు కోవటం మరచిన నిప్పులా వుంది ప్రపంచం. కదులు తున్న శవాల్లాంటి మనుషులు. అసలు మనిషికి ఏం కావాలి? ప్రేమా? శాంతా? సుఖాలా? లాలనా? కాదు ఇవేవీకాదు డబ్బు-అదుంటే అన్నీ వస్తాయి.

సిగరెట్ చేతిని కాల్చడంతో దూరంగావిసిరేశాడు దాన్ని ఒకప్పుడు...., కాలేజీలో చదువుతున్నప్పుడు ఎలా వుండేది తన జీవితం. అప్పుడు అందమైన బొచ్చుకుక్కలాగవుండేది, ఇప్పుడు గజ్జికుక్కలాగ వుంది. అప్పటికీ, ఇప్పటికీ మార్పేమీ లేదు. ఒక్కలాగే, కుక్కలాగే వుంది బ్రతుకు. అప్పుడూ ఇప్పుడూఏదో ఒకదానికి బానిస లాగే నడుస్తోంది.

కోపం వస్తోంది విశ్వానికి గతాన్ని తలచుకొని. పిడికిటి నిండా మట్టితీసుకుని సముద్రంలోకి విసిరేశాడు. ఎదుట పడ్డమనిషిని ఎముకలు విరిచెయ్యాలన్నంత కోపం.తనిలా మారడానికికారణం ఎవరు? ఎవరూకాదు. అందరూ. ఆలోచిస్తున్నాడు. లోలో చస్తున్నాడు.

ఎవరు తన తండ్రి? ఏమో తనకే తెలీదు. అసలీ లోకంలో ఎవ్వరికీ తండ్రెవరో తెలీదు తల్లి చెప్పిందాకా. తల్లి చెప్పలేదు. నిజం చెప్పాలంటే తన తండ్రి ఓ పచ్చకాగితం. కాగితం ఎన్నో పనులు చేస్తుందీ విశ్వంలో. మాంత్రికు లొకనాడు చిలకల్లో ప్రాణాలు దాచుకునే వారు, మనుషులీనాడు కాగితాల్లో దాచుకుంటున్నారు.

కలలా గడిచి పోయింది రెండేళ్ళ కాలేజీ బ్రతుకు. కలలో ఉలిక్కి పడి మేల్కొన్నట్లు జ్ఞాపకాల మెరుపులు తీరం చేరక ముందే విరిగి పోయిన అలలా ముగిసింది మూడో ఏడు. మిగిలింది బ్రాకెట్లో వేసుకో గలిగిన టియ్యే.

స్వప్నంలోకిస్వప్నంలా వచ్చింది"స్వప్న" ప్రేమకు భాష్యం ఆమె కళ్ళల్లో వెతుక్కొని. లాలిత్యానికి అర్థం ఆమె చీర కుచ్చిళ్ళపొత్తిళ్ళలో పాపాయిలా పడుకొని తెలుసుకుని, అనంతాన్ని ఆమెలో చూసి, ఆనందాన్ని ఆమెలో దాచి, జీవితం ఆమె గోరుకు వేసుకున్న ఎరుపు రంగుగా మార్చి, ప్రేమమైకంలో, స్వాప్నిక








లోకంలో, లతలా పెనవేసుకొని ఒక్క సంవత్సరం

అయినా రమణ చెబితే తను విన్నాడా? ఆ రోజు రమణతో గుండెలోని గుసగుసలతో సహా అన్నీ చెబితే ఏమన్నాడు.

"ఒరే విశ్వం ఎందుకురా ఈ పిచ్చి,బుద్ధిగా చదువుకోక" "ఛ, ఇది పిచ్చి కాదురా. భావి జీవితానికి ఇప్పుడే వేసుకున్నముడి" "కవిత్వం మాట్లాడకు రంతాను. ఈ ప్రపంచంలో ప్రేమంటూ ఏదీలేదు. అంతా ఆకర్షణ, అటాచ్‌మెంట్" రమణ.

"అయితే మా ఇద్దరిదీ ప్రేమకాదంటావా?"

"ఔను, ఇద్దరి మధ్యా ఆకర్షణతో ఏర్పడిన అటాచ్‌మెంట్‌నే మీరు "ప్రేమ" అని పిలుస్తారు.అటాచ్‌మెంటు లేక పోతే ఏదీ వుండదు. చూడు నేను చస్తే నువ్వు ఏడుస్తావా? ఐమీన్ బాధపడతావా?" అడిగాడు రమణ.

"ఔను"

"అదే. పేపర్లో ఎవరో చనిపోయారని చదివావనుకో బాధ పడతావా" అడిగాడుమళ్ళీ రమణ

"లేదు"

"ఎందుకు"

"అదేమిట్రా, నువ్వంటే నా స్నేహితుడివి, కలిసి జీవిస్తున్నాం. అందుకు బాధపడతా. అంతేగానీ ఎవరో ముక్కూ, మొఖం తెలియని వ్యక్తిపోతే ఎందుకు పడతాను..."

నవ్వాడు రమణ. "చూశావా అదే మరి అటాచ్ మెంట్. అంటే నీకూ నాకూ పరిచయం ఏర్పడి, ఒకర్నొకరు అర్థం చేసుకొని, స్నేహం పెరిగి, జీవితంలో కొంత కాలాన్ని కలిసి ఖర్చు పెడుతున్నాం అందుకే నా కోసం నువ్వు బాధపడతావు. నా లోటు నీకు కనిపిస్తుంది కాబట్టి ఫీలౌతావు. కాల గమనంలో క్రమంగా మరచిపోతావు ఇదే నేను నీకు పరిచయం కాక ముందే ఏదైనా జరిగితే ఫీల్ అయ్యే వాడివి కాదు. దీన్నే అటాచ్ మెంట్ అంటారు".

"ఒరేయ్ రమణా నీతో నేను వాదించలేను కానీ మేము ప్రేమించుకుంటున్నాం. కలిసి జీవించాలనుకుంటున్నాం, అంతే"

"రేయ్ అదంతా నీ యిష్టం. కానీ చూడు "ఆమె లేకపోతే జీవించలేను, ఆమే నా సర్వస్వం అనుకుంటూ, ఒక వేళ ఆమె అందుబాటు లోంచి దాటిపోతే దేవదాసులా మాత్రం తయారు కావద్దు...

"అయినా నన్నొదిలి తను వెళ్ళదురా"

ఇదిగో యిలాంటి పిచ్చి నమ్మకాలే వద్దంటున్నాను. ఆశలెన్నో వుంచుకో, కాని అనుబంధాన్ని పెంచుకోకు. అనుబంధం బంధంగా మారకపోతే అనవసరంగా జీవితమంతా బాధ" అంటూ వెళ్ళిపోయాడు రమణ.

ఏమిటి రమణ యిలా అంటున్నాడు. వాడు చెప్పిందాట్లో కొంత తర్కం వున్నా ఎలా అంగీకరించేది. మనసు నిండా ఆమె రూపమే వుండే. కనీసం ఊహల్లో కూడ మరచిపోలేక పోతున్నాడే, ఎలా ఆమె ప్రేమించలేదనుకోవటం? స్పందనగా. అణువణువులో పలుకుతున్న రాగంగా యింత బలీయంగా జీవితాన్ని అల్లుకుపోతే ... .... అయినా ఆమె లేక జీవిత మెందుకు? దీన్ని ప్రేమ కాదని ఎట్లా అనుకోవటం. తన వల్ల కాదు. చదువైపోగానే స్వప్నను తీసుకొని అమ్మ దగ్గరికి వెళ్ళిపోవాలి. ఏమంటుందో అమ్మ... అమ్మ... అమ్మ...

○ ○ ○

పైకిలేచాడు విశ్వం. సిగరెట్ కోసంజేబులు వెతుకుతున్నాడు ఖాళీగా వున్నాయి. అటూ ఇటూ చూశాడు నిర్మానుష్యంగా, ఎడారిలా వుంది ఇసుక. పడుకొని ఆకాశంలోకి చూశాడు. ఎవడో పీల్చి వదలిన పొగలా తేలుతున్నాయి మేఘాలు.

"అమ్మ" అప్రయత్నంగా పలికాయి అతని పెదాలు ఎంత ప్రేమగా చూసింది అమ్మ తనని. ఇరవైయేళ్ళు వచ్చే వరకు ఆమె ఎలా జీవించిందో తెలియకుండా పెంచింది. తరువాత ఎలాగో తెలిసింది. అమ్మ ఉద్యోగం భూపతికి ఉంపుడు గత్తె. ఎంత అసహ్యం వేసింది. తనకు ఆ క్షణం అమ్మే కాకపోతే గొడ్డలితో నరికి చంపాలని పించింది.

సూటిగా చూడలేక పోతున్నాడు అమ్మని.

"ఇలాంటి డబ్బుతో నా నన్ను పెంచింది" కసిగా కోపంగా అడిగాడు అమ్మని ఆమె ఏడుస్తుందని, ఏడుస్తూ ఏమేమో చెబుతుందని అనుకున్నాడు.


ఆమె అదేం చెయ్యలేదు. వేదాంతి లాగ ఒక చిన్న నవ్వు నవ్వి "డబ్బుకు అలాంటి, ఇలాంటి అనే తేడా లుండవురా-ఎలాంటి చోట వుంటే అలాంటి రూపంలో వుంటుంది"

"అమ్మా చేసిందానికి సిగ్గుపడక పైగా మాట్లాడుతున్నావా ఛీఛీ". "సిగ్గుపడాల్సి దినేను కాదు బాబూ, నాకు నిన్నిచ్చిన వాడు. నన్నీ స్థితికి తెచ్చిన వాడు"

ఆమె ముఖంలో శాంతం పోలేదు. విశ్వానికి కోపం తగ్గలేదు.

"బాబూ ఒక వయసులో వేసిన తప్పటడుగుకు, భ్రమకు నమ్మకమనే ముసుగు వేసుకుని మనిషిని నమ్మినందుకు, మనసుకావాలనుకున్న మనిషి మాట విన్నందుకు పవిత్రత శరీరానికి కాదు, ఆత్మకు అని అనుకున్నందుకు ఫలితం






నువ్వు"

"గౌరవం, పరువు, మర్యాద, తల్లి, తండ్రి, సంఘం, వీటన్నింటినీ జయించిన ఒకే ఒక్క మాట 'ప్రేమ' అన్నదానికి ఫలితం నువ్వు.

కడుపులో నీ అస్తిత్వానికి అంకురమే తప్ప ఆకారమే రాని స్థితిలోనే తన్ను మూద్దామనుకున్నాను. ఆ క్షణంలో నన్ను ఒడ్డుకు లాగింది భూపతి. నీకోసం బ్రతికాను, నిన్ను చంపే హక్కు నాకెక్కడిది అనే సినిమా డైలాగులు నేను చెప్పడం లేదు. ఆవేశం తగ్గాక నాకూ బ్రతకాలనే అన్పించింది.

చదువు లేనిదాన్ని, సంస్కారం ఎరుగనిదాన్ని, అందుకే అండగా నిలిచిన భూపతికి అన్నీ అర్పించాను. నాతో పాటు ఆయన కొడుకు కాకపోయినా నీ బాధ్యతా తీసుకున్నాడు. అయితే అది ఆర్థిక రూపంగానే. ఆ మాత్రం చాలదూ? ఇది తప్పా? నేరమా?" జీరపోయింది ఆమె గొంతు, కళ్ళల్లో నీళ్ళు.

విశ్వానికి కళ్లు తిరుగుతున్నాయి. అమ్మ చెబుతున్న నిజాల్ని భరించలేక పోతున్నాడు.

మనిషి నిజాన్ని భరించలేడు. అబద్ధాన్ని అంగీకరించలేడు. నిజంలాంటి అబద్ధాలు, అబద్ధంలాంటి నిజాలు కావాలి వాడికి.

"విశ్వం సమాజాన్ని సరిగ్గా చూసి అర్థం చేసుకోడానికి ప్రయత్నించు. ఇవేవీ ఆలోచించకుండా నీ రెండేళ్ల చదువూ పూర్తిచేసుకుని నీకంటూ ఓ జీవితం ఏర్పరుచుకో. నా గురించి ఆలోచించకు.

అమ్మ దగ్గర నుంచి వచ్చేశాడు.

ఇదంతా స్వప్నకు చెప్పాలి. ఆమె దగ్గర ఏ రహస్యమూ దాచకూడదు. చెబితే ఎలా ప్రవర్తిస్తుందో

ఇసుకలో ఆమె ఒళ్లో పడుకుని అంతా చెప్పాడు విశ్వం.

అంతా విని అతని తలలో వేళ్లు పోనిచ్చి "బాధపడకు విశ్వం. ఇందులో నీ తప్పేముంది. నువ్వేం చేశావని. ఆ స్థితిలో ఆమె మాత్రం అంతకంటే ఏం చేస్తుంది. అయినా నిన్ను అపార్థం చేసుకుంటానని, వదులుకుంటానని ఎలా అనుకున్నావు. ధైర్యంగా వుండు" అన్నది.

ఆ ఒక్క నమ్మకం చాలు ప్రపంచాన్ని జయించడానికి. ఆ ఒక్క లాలన చాలు బాధను బరువులేకుండా అవతల పారేయడానికి. ఆ ఒక్క ఓదార్పు చాలు అంతా మరచిపోవడానికి. అంతా విన్న రమణ "అదృష్టవంతు

డివి, ఆమెను ఫోగొట్టుకోకు" అన్నాడు.

వందేళ్ళ జీవితాలను అనుకోకుండా ఒక్కోసారి ఒక్కో క్షణాలు మార్చేస్తాయి. ఆ క్షణాల కుట్రకు జీవితం బలేకావచ్చు, వెలిగేపోవచ్చు.

సుఖాల శరీరాలకు మామూలుగా వచ్చే గుండెపోటు వచ్చి పోయాడు భూపతి. తల్లి, ఆమెతోపాటు విశ్వముూదిక్కులేనివాళ్ళయ్యారు.

ఆర్థిక ఆదాయం లేనపుడు ఉన్నది అమ్ము కొని జీవించాలి. శిథిల శరీరం ఎవరూ కొనరు గనుక, ఇంట్లో వస్తువులు అమ్మసాగిందామె.

తను ఏమౌతానో అన్న దిగులుకన్నా, విశ్వం ఏమౌతాడో అన్న దిగులుతోనే కన్ను మూసిందామె.

దిక్కులేని విశ్వానికి దిక్కు దిక్కులే అయ్యాయి. అమ్మడానికి వున్నవన్నీ అమ్మే శాడు. చదువు ఆ పోయింది.

సానుభూతి తప్ప సహాయం ఏ మిత్రుడూ చెయ్యలేదు. రమణకు తెలివి వుంది, విశ్వాన్ని ఆదుకోవాలనే బాధ వుంది, కానీ డబ్బులేదు. ఈ దేశంలో తెలివి, బాధ తిండిపెట్టవు.

రమణతో వుంటూ, దొరికిన రోజు తింటూ తిరుగుతున్నాడు విశ్వం

○ ○ ○

ప్రబంధాల కాలానికి ముందునించీ వున్న పాత చంద్రుడే కొత్తగా వచ్చాడు. బీచిలో జన సంచారం ఎక్కువగా లేనిచోట స్వప్న ఒళ్ళో విశ్వం. నిజానికి విశ్వమంతా స్వప్నం ఒడిలోనే వుంటుంది. ఎక్కడెలా వున్నా ఆమె ఒడిలో అతను చక్రవర్తి, ఆమె సామీప్యంలో అతడు చైతన్య దీప్తి.

"మనసంగతి మాయింట్లో తెలిసిపోయింది విశ్వం. నాకు చాలాగట్టిగా పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏం చేద్దాం?) "ఏదో విధంగా కొంత కాలం నెట్టుకురా స్వప్నా, ఈ లోపల ఏదైనా ఆలంబన దొరుకు తుంది. తరువాత ఇద్దరం కలిసే వుండచ్చు"

"లాభం లేదు విశ్వం, ఇప్పుడు నేనేం చెప్పినా నమ్మరు పెళ్ళి వాయిదా వేస్తున్న కారణం వాళ్ళకు తెలిసి పోయింది. అందుకే ఇంకా తొందర చేస్తున్నారు, నువ్వు త్వరగా ఏదోఒకటి చెయ్యాలి. లేదా...." బాధగా అంది స్వప్న.

"ఇన్నాళ్ళ బంధమూ ఇంతేనా" విశ్వం.

"వాస్తవంలోకి వచ్చి ఆలోచించు విశ్వం. పరిస్థితులు మన చుట్టూ గోడలు కడుతున్న పుడు వాటిని ఛేదించుకు పోగల శక్తి మన కుంటేనే వెళ్ళగలం, లేదా బందీలు కాక తప్పదు"

సిగరెట్టు వెలిగించుకున్నాడు విశ్వం.

"స్వప్నా ఇప్పుడే ఎక్కడికైనా వెళ్ళి పోదాం, నాతో వస్తావా" దృఢంగా అడిగాడు విశ్వం.

"అంటే"

"మీ వాళ్ళకు దూరంగా ఎక్కడికో మన మెవ్వరో తెలియని మనుషుల మధ్య లోకి వెళ్ళి పోదాం"

"వెళ్ళి ఏంచేద్దామని" బాధతో కూడిన వ్యంగ్యం ధ్వనించిందామె గొంతులో.

"కలిసి జీవిద్దామని"

"ఇంత తేలిగ్గా నువ్వు మాట్లాడతావను కోలేదు విశ్వం. ఎక్కడికో వెళ్ళి ఏంచేద్దామని? ఎలా జీవిద్దామని? ఇంత మంది తెలిసి వున్న ఇక్కడే ఏమీ చెయ్యలేని మనం, ఎవ్వరూ తెలియని ఎక్కడో ఎలా బ్రతక గలం. ప్రేమ మైకంలో పారిపోయినా తరువాత భయంకరాన్ని భరించక తప్పదు. రెండు రోజులు ప్రేమతో ఆకల్ని మరచి పోగల కాని. ఆ తరువాత ఇబ్బందులూ, ఆకలి పిడుగుల్లా నెత్తిన పడు తున్నపుడు ప్రేమ గుర్తుకు రాదు నీకళ్ళల్లో నీకు కరుణ కనిపించదు. లోతుకు పోతున్న శూన్య మేదో కనిపిస్తుంది"

"అయితే ఏం చేద్దాం" ఆవేశంగా అన్నాడు.

"అది నీ చేతుల్లో వుంది. నీ పెద్దలు నన్ను మరో మనిషికి భార్యను చెయ్యకముందే ఏదో ఒక చిన్న ఉద్యోగం చూసుకో. ఆ క్షణమే నీ కోసం వచ్చేస్తా. లేదా ఆపై ఏం జరుగుతుందో."

రాత్రి అవుతోందని వెళ్ళిపోయింది స్వప్న. కొంతకాలంలోనే మరో మనిషి జీంలోవితకి వెళ్ళిపోయిందామె.○

○○





లేచి కూర్చున్నాడు విశ్వం. విసుగ్గా ఉంది. గతాన్ని తలచుకుంటున్న కొద్దీ కసిగా వుంది. బట్టలన్నీ విడిచేసి అలల్లో కెళ్ళి తడుస్తూ కూర్చునాడు, మోసం చేసింది స్వప్న అనుకుంటూ.

"ఏం చేస్తుంది పాపం. ప్రతి స్త్రీలాగే తనూ భద్రత కోరుకుంది. అది నీ దగ్గర లభించదని తెలిసి వెళ్ళిపోయింది. యాంత్రికత నుంచి విడివడి, కష్టాలతో కలబడి, మార్పు కోసం ముందు నిలిచేవాళ్ళు ఎప్పుడూ కొద్దిమందే వుంటారు అలాంటిది కాదు స్వప్న. అందుకే వెళ్ళిపోయింది" అంది ఎక్కడో దాక్కున్న మనసు.

బిగ్గరగా సముద్రం ప్రతిధ్వనించేలా నవ్వాడు విశ్వం. మనసా నువ్వింకా నాలో బ్రతికున్నావా అని.

అలలు అతని శరీరంపై విరిగిపడుతున్నాయి. ఆలోచనలు అతని మస్తిష్కంలో మరిగిపోతున్నాయి. గానుగెద్దు కాలం తిరుగుతూనే వుంది. సముద్రం మొరుగుతూనే ఉంది.

తనిలా మారడానికి కారణం ఎవరు? ఎవరూ కాదు, అందరూ?

అమ్మ ఉంపుడుగత్తెగా మారడానికి కారణం... డబ్బు. తన చదువు ఆగటానికి కారణం.... డబ్బు. స్వప్న వదిలిపోవడానికి కారణం... డబ్బు.

ప్రపంచం డబ్బు చుట్టూ తిరుగుతోంది. అదుంటే అన్నీ వుంటాయి.

భర్త చనిపోతే "ఈ పిల్లల్ని ఎలాపోషించాలి బాబూ" అని ఏడుస్తుంది భార్య. భర్త పోయాడనే బాధను మించి రేపటి ఆకలిపు దిగులు కనిపిస్తోందక్కడ. తండ్రి సంపాదిస్తున్న కాలంలో కొడుకుని గదమాయిస్తాడు, కొడుకు సంపాదిస్తున్న కాలంలో తండ్రిని డామినేట్ చేస్తోంది ఎక్కడా?

తలపట్టుకుని సముద్రంలోంచి బయటికి వచ్చాడు విశ్వం. ప్రపంచం మారాలి. చల్లని గాలిలాగ, స్వచ్ఛమైన నీటిలాగ కమ్మని పాటలాగ ఎప్పుడు జీవిస్తాడు మనిషి? కులమతాల్ని మరచి, భయం అంటే ఏమిటో గుండెకు తెలీక డబ్బుకు దాసోహంకాక ఎప్పుడు జీవిస్తాడు మనిషి? కన్నీళ్లు కనబడని ప్రేమ పాలించేదెప్పుడు లోకాన్ని?

అన్నిటిపై అధికారం చెలాయిస్తున్న ఈ డబ్బును ఎవ్వరికీ లేకుండా చేస్తే? ఊహుం. అందరికీ అందుబాటులోకి తెస్తే.

ఔను, ఏదో చెయ్యాలి. తనలాగాఎవ్వరూ ఓడిపోకూడదు. ఏదో చెయ్యాలి. అందుకు కొంత హింసైనా భరించాలి. తప్పదు. దున్నితేనే భూమి పండుతుంది. కోస్తేనేపుండుమానుతుంది.

మనసు తెరిపి స్వచ్ఛంగావుంది. బయలుదేరాడు విశ్వం. అనుకున్నది సాధించడానికి, సాధించాలనుకున్న దానికై సాహసించటానికి.

చీకటి పారదోలడానికి ఎర్రగాపైకొస్తున్న సూర్యుడి తూర్పు దిక్కుకి, కోయిల తీపిపాటలోకి, బందూకులు రాజ్యం చేస్తున్నా భయం లేని చోటికి, వేడీ వాడీ నిండిన గుండెలలోకి ...వెళ్తున్నాడు విశ్వరూపం దాల్చి... విశ్వకోపంతోటి....విశ్వశోకంకూల్చ....విశ్వం.



వచ్చే సంచికనవలానుబంధంలో

శివల జగన్నాధరావు రచన

మైత్రేయి

చదవండి




27 సీరియల్

పుణ్యంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ పిల్లలు అంటారు. పాపం కొద్దీ టెలిఫోను అని కలుపుకోవచ్చు అనుకుంది జానకి ఆ మర్నాడు.

అలా అనుకోవటంలో ఆమెద తప్పేంలేదు.

తెల్లవారుఝామునే బుక్ చేస్తే వేగం వస్తుంది అన్న రాజేశ్వరరావు మాట ప్రకారం, తెల్లవారు ఝామునే లేచి జగన్నాధానికి ట్రంకాల్ బుక్ చేసింది. ఎందుకేనా మంచిదని హాస్పటల్ నెంబరు, యింటి నెంబరు కూడా యిచ్చింది.

"హలో గుడ్‌మార్నింగ్ మేడమ్" అన్న ఆపరేటరు మేనర్సుకి ఆశ్చర్యపోయింది. మన టెలిఫోను వాళ్లు బాగా యింప్రూవ్ అయేరే అని అభినందించింది కూడా.

అయితే ఆ అభినందనని వాళ్లు ఎక్కువ కాలం నిలబెట్టుకోలేక పోయేరు.

తెల్లవారింది ఫోను రాలేదు.